

# ఇవ్వడంలోనే ఉంటుంది నవ్వడం!

అవసరాల రామకృష్ణారావు

మన ఇంటి గదుల కొలతలకీ మన జీవన సౌకర్యానికీ సంబంధముందని ఎవరైనా ఒప్పుకుంటారు. పిత్రార్జితమైన మా పెంకుటింటి గదులు పెద్దవే మరి! అయితే గదుల కంటే విశాలమైనది మరోటి ఉండొచ్చని రుజువు చేసిన ఆ సంఘటన నేను కాదనలేనిది. దీన్తో పాటు మరో విషయం నాకు కనువిప్పు కలిగించింది. పిల్ల కాలువలు వచ్చి చేరితే ఎలా ప్రవహించాలో చెయ్యి పట్టుకుని ముందుకు నడిపే జీవనదుల్లా ఉండాలి తల్లిదండ్రులు. ఇంత బలమైన ముద్ర పడ్డాక ఒకరితో చెప్పుకోకుండా ఎలా ఉండగలను!

అన్ ట్రెయిన్డ్ టీచర్‌గా ప్రైవేటు స్కూల్లో పని చేస్తున్న ఆ రోజుల్లో జీతం బొటా బొటీ అయినా ప్రైవేట్లు కూడా చెప్పి ఎలాగో బండి లాగిస్తూ ఉండేవాణ్ణి. సొంతిల్లంటూ ఉంది గనుక, అప్పుడన్నీ చవక గనుక, నేనూ మా అమ్మ మా ఆవిడ నా యిద్దరు పిల్లలూ ఒకరి దగ్గిర చెయ్యి జాచకుండానే రోజులు నెట్టుకొచ్చేవాళ్ళం.

పిల్లలు తిన్నగా ఉండరు కదా! ఓ రోజు మా గోపీ ఫుట్‌బాల్ ఆటలో పాదానికి బాగా పెద్ద దెబ్బే తగిలించుకు వచ్చాడు. కాలు కింద మోపలేక ఒకటే గోల. డాక్టరుకి చూపిస్తే ఏదో మందు రాసి కట్టుకట్టేడుగానీ వాడు పెట్టిన గోలకి మా యింట్లో ఎవరికీ ఆ రాత్రి తెల్లవార్లూ కునుకన్నది లేదు. మేమున్న పల్లెటూరికి దగ్గిర ఊరు విజయనగరం.'ఇదేదో ఫ్రాక్చరులా ఉంది, తీసికెళ్ళి ఎక్స్‌రే తీయిస్తే గాని దీని సంగతి తేలదు' అనుకుంటూ ఓ రోజు శలవు పెట్టి ఆ మర్నాటి ఉదయం వాణ్ణి తీసుకుని నేనూ, మా ఆవిడ జానకీ బస్సులో నగరం చేరాం.

స్కూలూ, ఇల్లూ- ఇవే నా ప్రపంచం అనుకుంటాను గనక అక్కడా నాకు చుక్కే ఎదురైంది. గోపీ దెబ్బని పరీక్ష చేసిన డాక్టరు కన్సల్టింగ్ ఫీజు వందే

అయినా కొన్ని వేల భయాలు నాలో కలిగించాడు. వెంటనే పాదానికి మూడు యాంగిల్స్ నుంచి ఎక్స్‌రే తీయించాలనీ, సర్జరీకి ఏ మాత్రం డిలే చేసినా పాదమే అక్కడికి కొట్టెయ్య వలసి రావొచ్చనీ హెచ్చరించాడు. కనీసం నాలుగు రోజులక్కడ ఉండక తప్పదనీ, పదివేల ఖర్చుకి సిద్ధంగా ఉండమనీ భయపెట్టాడు.

రెండు సంచీల్తో సామాను పట్టుకుని సాయంకాలం తిరుగు బస్సులో రిటర్నవుదామని వచ్చాం మేము. ముందుగా ఆస్పత్రి దగ్గరగా వున్న ఓ హోటల్‌లో ఓ రూమ్ తీసుకుని భోజనాలు కానిచ్చాం. వెయ్యి రూపాయలు జేబులో వేసుకుని బయల్దేరిన నేను సగానికి సగం రూమ్ రెంట్ అడ్వాన్సుగా కట్టేశాను. ఇక ముందెలా? అక్కడ ఆ పాత ఎడ్రసులోనే సుబ్బారావని మా క్లాస్ మేట్ ఒకడున్నాడని గుర్తొచ్చింది. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో వాడు బాగా పైకొచ్చాడని విన్నాను. దాసన్న పేట పరిగెత్తాను.

కారులో బయల్దేరడానికి సిద్ధంగా ఉన్నాడు, సుబ్బారావు నేను వెళ్ళేసరికి. పలకరించి చాలా బిజీగా ఉన్నట్టు చెప్పేడు. నా ఇబ్బంది రెండు ముక్కల్లో వివరించాను. 'నేనేదో తెగ సంపాదించేస్తున్నానని మనవాళ్ళంతా అనుకుంటున్నారు కాబోలు! అప్పుల్లో పీకల దాకా మునిగిపోయి ఉన్నాను. ఇప్పుడు నేను వెడుతున్నదే మార్వాడీ దగ్గరకి, ఇరవై వేల రుణం కోసం. ఏమీ అనుకోకు. ఎంత చెట్టుకంతగాలి!' అంటూ కారు పోనిచ్చాడు. నేనక్కడ చెట్టుకింద రాతిదిమ్మ మీద కూలబడ్డాను నిరాశగా. వాడి ఆఖరి మాటని మళ్ళీ మళ్ళీ గుర్తు చేసుకున్నాను. ప్రతీ వాక్యాన్నీ పారడీ చేసి నవ్వు పుట్టించే జోగులుగాడు గుర్తొచ్చాడు. డిగ్రీలో వాడు నా క్లాస్‌మేట్. బియ్యే లిటరేచరు కాబోలు వెలిగించాడు. 'ఎంత చెట్టుకి అంతగాలి' అనే సామెతని వాడోసారి ఎలా మార్చాడో గుర్తొచ్చి నవ్వుకున్నాను. ''అవును వును. ఎంత గుట్టుకి అంత కంగాళీ'' అనే వాడి చురక సుబ్బారావు విషయంలో సరిగ్గా సరిపోతుంది. ఇలాంటప్పుడు జోగులు దగ్గిరుంటే ఎంత ధైర్యంగా ఉండును! గిరిగీసుకుని బతికే నా లాంటి వాడిలో కూడా నవ్వుల సిరి వెలిగించాడు వాడు. వచ్చిన పని మరచిపోయి ఆ దిమ్మ మీదే పది నిముషాలు కూచుని వాడి జోకులు నెమరు వేసుకుంటే నన్ను నేనే మరచిపోయినట్లైంది.

ఓ సారి ఏదో సభలో ఎవరో 'నేనో షార్ట్ స్టోరీ చదువుతాను' అని మొదలెట్టబోతే జోగులు గాడు లేచి 'మంచిదే టాల్ స్టోరీ మాత్రం చెప్పకండి' అని చమత్కరిస్తే మేం తెల్లబోయాం. తర్వాత ఇంగ్లీషు లెక్చరరు బోధపరిచారు. 'టాల్‌స్టోరీ' అంటే సుదీర్ఘ కథ కాదుట, శుద్ధ అబద్ధం అనిట! వాడి భాషా విన్యాస వినోదాలు ఒకటా రెండా! మా కాలేజీ వారోత్సవాల్లో ఓ సారి ఉపన్యాసకులుగా బోయి రామన్నగారూ, నామిని కష్ణవేణిగారూ వస్తున్నారని తెలిసింది. వారు ఓ సారి మైకు పట్టుకుంటే మరి వదలరని ప్రతీతి. మా జోగులు గాడు పరిగెత్తుతూంటే ఎందుకురా అని అడిగాం. 'బాబోయ్ రామన్నగారు, నాయనోయి కష్ణవేణి గారు' అని జవాబు! 'శోకానికి టాకా నా జోకుల తడాఖా' అని వాడెందుకన్నాడో తెలిసొచ్చింది. త్రుళ్ళిపడి లేచి హోటల్‌వైపు త్వరత్వరగా నడిచాను. ఈ ఊళ్ళోనే ఎక్కడో ఏదో ఆఫీసులో చిన్న గుమాస్తా ఉద్యోగంలో స్థిరపడ్డాడని విన్నాను. కలుసుకుంటే బావుణ్ణని ఉంది గాని ఏం లాభం! ఈ పట్నంలో ఏం తిప్పలు పడుతున్నాడో పిచ్చి వెధవ!

తిరిగొచ్చి హోటల్ మెట్లు నేను ఎక్కుతుండగా వాడు, ఇంకెవడు ఆ జోగులు గాడే, అక్కడ టీ తాగడానికొచ్చి నాకు కనిపించడమంత వింత అదేగాని మరోటి లేదు!

''నువ్వా జోగారావ్,

నువ్వేనా, ఇక్కడేమిటి! అయినా ఆ మొహమేమిటి స్నానం చేసిన అగ్నిహోత్రుడిలాగ!'' అంటూ భుజం మీద చెయ్యివేస్తే ఆ స్పర్శకి కన్నీళ్ళాపుకోడం కష్టమైపోయింది. ఎలాగో నిగ్రహించుకుని ఎదుర్కొంటున్న దయనీయ స్థితిని వివరించాను. హోటల్ బాయ్‌ని కేకేసి నీళ్ళు తెప్పించి మొహం కడుక్కోమన్నాడు. టీ పట్టించాడు. 'ఓస్ ఇంతేనా!' అన్నట్టు మొహం పెట్టాడు. ఆ తర్వాత వాడు తీసుకున్న క్విక్ యాక్షన్ జన్మలో మరచిపోలేను. హోటల్ ఓనరు వాడికి తెలుసట. నేను చెల్లించిన ఎడ్వాన్స్‌లో నాలుగొందలు వెనక్కి తీసుకుని నా చేతిలోపెట్టి అప్పటికప్పుడు రూమ్ ఖాళీ చేయించాడు. ఇన్ని చికాకులుండి ''ఈ మహానగరంలో హోటల్‌లో దిగుతావా, నీకేం బుద్ధుందా జోగారావ్? మనకేం కుప్పలు కుప్పలు బ్లాక్ మనీ మూలుగుతోందా? రూం రెంటూ, భోజనాలూ, కాఫీ టిఫెన్లూ రోగాలూ వైద్యాలూ మూడు రోజులకెంతౌతుందనుకుంటున్నావ్, చాల్లే, పద పద'' అంటూ గోపీని జాగ్రత్తగా నడిపించుకుని, సంచీల్తో సహా మా ముగ్గుర్నీ వీధిలో ఆగిన రిక్షాలో ఎక్కించాడు. విజిల్ వేసుకుంటూ తనూ సైకిలు మీద రిక్షాని ఫాలో అయ్యాడు. ఇంకా టైముంది కదా, లాస్ట్ బస్‌కి మా ఊరి ప్రయాణానికి, సెండాఫ్ చెప్పడానికి కాబోలు అని నేనూ జానకీ అనుకున్నాం. తీరా చేస్తే వాడు రిక్షా వాడిని ఆపమని చెప్పిందెక్కడ! జానా బెత్తెడు అయినా లేని వాడి అద్దె వాటా దగ్గర!

సైకిల్ స్టాండేసిన జోగులు 'రండమ్మా రండి రండి!' అంటూ మా ఆవిణ్ణీ నన్నూ ఆహ్వానించి, ఓ చేత్తో మా సంచీలు చేరేస్తూ గోపీని చెయ్యి పట్టుకుని లోపలికి నడిపించాడు.

అక్కణ్ణుంచి చూస్తూనే ఆ వాటాలో అడుగు పెట్టడానికే నా గుండె గుభేలు మంది! నాలుగు వాటాల కొంపలో వీళ్ళుంటున్నది రెండున్నర గదుల వాటా. వీళ్ళదా మూడుంముప్పావు ఫ్యామిలీ. ముగ్గురు పిల్లల తర్వాత ఇల్లాలు మళ్ళీ మోపు నెలల మీదుందన్నమాట!

చెయ్యందుకున్న గర్భిణీ గృహిణితో మా జానకి ''ఎన్నేళ్ళైందో మిమ్మల్ని చూసి! బాగా నీరసంగా, బొత్తిగా చీపురు పుల్లలా కనిపిస్తున్నారే!'' అంది ఏదో మాట వరసకు మామూలు పలకరింపుగా. ఆ మాట చెవిన పడ్డాక మా జోగులు ఊరుకుంటాడా!

''ఒరే పిల్లలూ, చిట్టీ, చిన్నీ, సిసింద్రీ! ఎక్కడున్నారు? ఓ సారి అందరూ ఇక్కడికి రండి. ఆంటీ ఏమంటున్నారో విన్నారా! మీరు ఇది వరకు చీపురు పుల్లని చూశారో లేదో, ఇదిగో మీ అమ్మ రూపాన మీ ఎదురుగుండానే ఉంది!''




## రెండో అమ్మ 'ఆమె'

దుఃఖాన్నంతా తానే దిగమింగి
సంతోషాల్ని మాత్రమే పంచే ఆమె
జీవితం మలిదశలో
ఎవరికైనా ఆమె రెండో అమ్మే!
ఇంతకాలం ఎట్లా కలిసి నడిచామో
నల్గురిలో తలెత్తుకుని ఎట్లా నిలిచామో
జ్ఞాపకాలు తవ్వుతున్న కొద్దీ
వింత వింత అనుభూతులు
చిత్ర విచిత్ర పరిమళాలు!
ఏడడుగులు నడిచొచ్చిన రోజున
ఏమీ ఎరగని పిల్ల
ఎట్లా ఎదిగిందో
నెమరేసుకున్న కొద్దీ
నేను వామనుడినై
ఆమె అనంత వ్యాప్తమై
వెలుగుతూ ఆశ్చర్యంగా మిరిమిట్లు గొలుపుతూ
భరోసా రూపమై నా వెనుక నిలుస్తోంది!
నేను అది చూసే కదా
భూగోళాన్ని చిటికెన వేలుమీద తిప్పుతున్నది
నా పిల్లలు ఎగురుతూ గంతులేస్తూ
భూనభోంతరాళాలను ఏకం చేస్తున్నది!
మలి సంధ్యలో ఆమె అస్తమించని వేకువ
దారిచూపే వెలుతురు
బతికిన క్షణాల నిండా ఆమె చిక్కని వలపు!

–కోట్ల వెంకటేశ్వరరెడ్డి
**94402 33261**

ఆ జోకుకి పిల్లలందరితోపాటు వాళ్ళమ్మ కూడా చిన్న పిల్లై మరీ మరీ నవ్వడం మా కెంతో వింతని పించింది. తనమీదే జోకు వేసుకునే వాడికి ఇదొక లెక్కా! ''చచ్చాక కొరివి పెడతారో మానారో, మొయ్యడానికైనా నాలుగో చెయ్యి అవసరం కదా!'' అంటూ పెళ్ళాం కడుపు వైపు చూస్తూ నవ్వేవాణ్ణి ఏమనాలి!

ఏమనాలో మానాలోగాని మమ్మల్నీ ఇరుకు జాగాలోకి ఎందుకు ఏం చెయ్యాలని తీసుకొచ్చాడో తెలీలేదు. ఇంతకంటే కాలుమోపడానికి నాజూగా లేని కిక్కిరిసిన తిరుగు ప్రయాణపు బస్సే నయం! ముందున్న కాస్త పెద్ద గదిలో మమ్మల్నో పక్క కూచోపెట్టి వేడి వేడి కాఫీ ఇప్పించిన మాట నిజమే గాని, ఏ విధంగా అది నివాస యోగ్యం?

పిల్లల ఆట వస్తువులూ, పుస్తకాలూ, బూట్లూ గోడల మీద కొక్కేలకి తగిలించిన మాసిన బట్టలూ, పెట్టెలూ వాటి మీద చుట్ట బెట్టి ఉంచిన బొంతలూ, సగం గదిని ఆక్రమించిన ఓ బల్ల మంచమూ, ఓ పక్కకి పెట్టిన రెండు మడత కుర్చీలూ, ఓ పక్క టీవీ – ఇలా కాలు పెట్టడానికే కాదు కన్ను తిప్పుకోడాని క్కూడా జాగా లేని కొంపలో మమ్మల్నేం చేద్దామని పిలిచి కూచోపెట్టినట్టు!

తమాషా ఏమిటంటే పెద్దవాళ్ళిద్దరికే కాదు, పిల్లలు ముగ్గురికీ కూడా ఇదేం పట్టినట్టు లేదు. సర్కసులో ఓ అయిటెమ్‌కీ మరో అయిటెమ్‌కీ మధ్య ఏర్పాట్లు చేస్తారు చూశారా, ఆ స్పీడుతో ఆ గది రూపాన్నే మార్చేశారు. సగం సామాన్లు ఆ పక్కనున్న అంతకన్న చిన్న గదిలోకి వెళ్ళిపోయాయి. మాకా బల్ల మంచమూ, సరిపడే పరుపు మీద కొత్త దుప్పటీ, పక్క బల్ల మీద రివాల్వింగ్ టేబిల్ ఫానూ అమరిపోయాయి. ముందే పక్కింటి వాళ్ళకి కబురంపించాట్ట. మరో గంటలో మాకు వేడి వేడి టేబిల్ మీల్స్ సిద్ధమయిపోయాయి. వాళ్ళు కూరలూ పచ్చడీ సప్లయి చేస్తే ఇతని పెళ్ళాం సింపుల్‌గా అన్నమూ చారూ చేసిందట! పెద్దాళ్ళు చెయ్యడం ఎక్కడైనా ఉంది, ఇంతింత పిల్లలు కూడా పోటీ పడి తల్లిదండ్రులకి సాయం చెయ్యడం నేనిదే చూడ్డం!



## ఐష్‌కీ, కరీనాకి ఇది నిజమైన దీపావళి!

ఈ దీపావళి ఐష్‌కీ, కరీనాకే కాదు, వారి అభిమానులకూ నిజమైన పండుగే అంటున్నారు బాలీవుడ్ ప్రముఖులు. ఈ ఇద్దరు ముద్దుగుమ్మలు నటించిన రెండుచిత్రాలు నవంబర్ 5న విడుదల కానున్నాయి. 'యాక్షన్ రీ ప్లే'లో ఐష్ అందం రెట్టింపు కాగా, 'గోలీమాల్ 3'లో కరీనా కాస్త ఒళ్ళు చేసి బొద్దుగా, ముద్దుగా కనిపించనుంది. పై రెండు సినిమాల్లో ఈ ఇద్దరిలో ఎవరు ఎక్కువగా అందంగా ఉన్నారన్నది నిర్ణయించడం కష్టమైన పనే అని బాలీవుడ్ పరిశీలకులు అంటున్నారు. బాక్సాఫీసు దగ్గర ఈ ఇద్దరు ముద్దుగుమ్మలు పోటీపడడం బహుశా ఇదే మొదటిసారి కావచ్చు అని వారంటున్నారు. ఈ పోటీలో ఎవరు నెగ్గిందీ? ఎవరు ఎక్కువ మార్కులు కొట్టేసిందీ నవంబర్ ఐదు తరువాతే తెలుతుంది. అప్పటి వరకూ సస్పెన్సే!

వాళ్ళూ భోం చేసి వచ్చాక ఇంత మంది ఎక్కడ పడుకుంటారో అని మేం కంగారు పడ్డాం గాని వాళ్ళకి చీమకుట్టినట్టు లేదు! మాకో దోమ తెర కట్టి ఇక్కడ పడుకో బెట్టి, చిన్న గదిలో మడత మంచం వాల్చుకుని జోగులుగాడు పడుకుంటే, పక్కవీధిలో ఆవిడ అక్కగారున్నార్ట, అక్కడ వీధిగది ఊరికే పడుందిట, దాన్ని పావనం చెయ్యడానికి ఇతని పెళ్ళాం ఆఖరాణ్ణి తీసుకుని నవ్వుతూ వెళ్ళడం!

నాకు ఇంత వరకు తెలిసిన జీవితం ఇలా లేదు!

ఎవరి బతుకు వారు వెలిగించుకోడానికే శక్తిచాలని రోజుల్లో ఇచ్చి పుచ్చుకునే స్వేచ్ఛ కూడా ఒకటుండగలదని ఇన్నేళ్ళూ మేం అనుకోనే లేదు!

వీళ్ళే కాదు తక్కిన వాటాల వారందరూ అంతో ఇంతో మాకు సాయం చెయ్యడానికి చెయ్యందించిన వాళ్ళే!

మర్నాడు పొద్దున్నే తనకి తెలిసిన డాక్టర్నెవర్నో జోగులుగాడే తీసుకొచ్చాడు. ఆయనే వీణ్ని కూడా తీసికెళ్ళి ఎక్స్‌రేలు తీయించాడు. ఆ సాయంకాలానికే ఎక్స్‌రే రిజల్టు కూడా వచ్చేశాయి. అవి పట్టుకొచ్చి నవ్వుతూ వాడిలా అన్నాడు.

''ప్రస్తుతం డాక్టర్లకి తెలిసినవి రెండే రెండు. దుక్కలాంటి వాడినైనా పడక చేర్చడం, వీలైనంత ఒడక నేర్చడం! ఇలాంటి వాడు కాని వాడు దొరకడం మన అదృష్టం. ఎక్స్‌రేలు చూసి మన డాక్టరు ఫ్రెండు ఏమన్నాడో తెలుసా?''

మేం ముగ్గురం జవాబు కోసం ఆత్రంగా ఎదురు చూశాం. ''సర్జరీ అక్కర్లేదుట. టేబ్లెట్లు ఇంజక్షన్లూ యిస్తూ రెండ్రోజులు డ్రెస్సింగ్ చేస్తే చాలట. ఆ తర్వాత మాత్రం ఓ వారం పాటు కేప్సూల్స్ వాడాలట. సరేనా?''

అని అన్ని ఏర్పాట్లూ చేసి ఆఫీసుకి పరిగెత్తాడు. అప్పట్లో సెల్‌ఫోన్లు లేవు. అసలు ఇళ్ళల్లోనే లేవు. వాళ్ళ ఆఫీసు నుంచి మా స్కూల్‌కి ఫోన్ చేయించే బాధ్యతా వాడిదే. మూడ్రోజులు లీవు ఎక్స్‌టెండ్ చెయ్యడంతోపాటు మేమిలా ఉన్నామనే కబురు మా అమ్మా వాళ్ళకీ అంద చెయ్యమని స్కూలు వాళ్ళని రిక్వెస్టు చేయించిందీ వాడే.

ఇంతటి అనురాగమయ వాతావరణం నుంచి మళ్ళీ హోటల్‌కి మకాం మార్చేస్తాననే దొంగ మొహమాటానికి నేనేమీ పాల్పడలేకపోయాను. మంచి మార్పుకి మనసు సిద్ధపడినా లోలోపలే మగ్గిపోయే స్వభావం నాది. జానకి మాత్రం అలా కాదు. జోగులు పెళ్ళాంతో ఓ రోజులోనే మమేకమైపోయింది. వంట సాయం చెయ్యడం ఒకటే కాదు, పిల్లలకి నీళ్ళు పోసి బట్టలు కట్టడం వరకు తోర్పడేది. ''మీ పురుటి డేటు ఎప్పుడో రాయండి, వారం రోజుల ముందే వచ్చి సాయం చేస్తాను'' అంది, నా పెర్మిషన్ తీసుకోకుండానే! ఇక మా గోపీ గాడికి కంపెనీ యివ్వడానికని చిట్టీ చిన్నీ ఆ రెండ్రోజులూ స్కూల్‌కి డుమ్మా కొట్టేశారు. ఓ పేకాటా, ఓ కేరమ్సూ, టీవీలో కార్టూన్సూ, మా వాడికి పాదం బాధ పట్టించుకోవడానికి టైము లేకుండా పోయింది!

ఆ రెండ్రోజులూ పాదం గాయానికి డ్రెస్సింగ్‌కి డాక్టరు రోజూ వచ్చి ఇంజక్షన్ కూడా చేసి వెళ్ళేవారు. ''చూడబోతే చిన్న కుర్రాడా! అదేమిటో వీడి పాదం పట్టుకోడానికి ఎక్కడెక్కడి డాక్టర్లూ మా యింటికి రావడమే'' అనే మా జోగులుగాడి జోకు ఒకటీ!

అయ్యా అదీ నన్ను కదిపిన, లేదా కుదిపిన అనుభవం! మా కుర్రాడి పాదానికంటే నా బుర్రకే ఎక్కువ వైద్యం జరిగిందనుకుంటాను. అంత చిన్న కొంపలో అంత పెద్ద రొంపిలో అంత హాయిగా ఉండడం వాళ్ళకే చెల్లింది! అలాంటి వారు కాక ఇంకెవరు స్నేహ హస్తం అందించగలరు!

ఇంటికొస్తూనే విశాలమైన మా డ్రాయింగు రూమ్‌ని చూసుకుంటే పైకి కనపడని వెలితి ఒకటి స్పష్టంగా గోచరించింది. ఆ హృదయ వైశాల్యంతో పోల్చుకుంటే ఇదెంత సంకుచితం! వాణ్ణి తలుచుకుంటేనే ఏ చికాకు లోంచైనా చిరునవ్వు పుట్టుకొస్తుంది. నడి వయసు గాణ్ణైతేనేం నేర్చుకోలేనా వాడి దగ్గర! అలాకాకపోతే నా పిల్లలకి నేనేం యివ్వగలను!

✻

రచయిత సెల్: 9866221575